# కనిపించని నిజాలు

**ఆ** నర్సింగ్ హోమ్ విజయవాడలో ప్రముఖ గైనకాలజిస్ట్, నా కాలేజి స్నేహితురాలూ అయిన స్నేహలతది. అమ్మని చూడటానికని హైదరాబాద్‌నుంచీ విజయవాడ వచ్చి స్నేహితురాలిని పలకరించాలని వెళ్లాను.

ఆ మాటా, ఈ మాటా మాట్లాడి పరస్పరం జీవితాలోకనాలు, కుశల ప్రశ్నలు కానిచ్చుకుంటుండగా స్నేహలత నన్ను తీక్షణంగా చూసి అడిగింది.

"నీవూ అందరాడవాళ్ళలాగే ఉంటావనుకోలేదు, కమలా! ప్రతిరోజూ నాదగ్గరకు ఎందరో ఆడవాళ్ళు వస్తూంటారు. వాళ్ల రోగాలూ, అవి ముదిరేవరకూ తమ గురించి ఆలోచించుకోనివ్వని కుటుంబ పరిస్థితులూ, తన ఆరోగ్యం గురించి కనీస శ్రద్ధతీసుకోవాలనే పట్టుదలా లేకుండా ఆ సంసారపు ఊబిలోనే కూరుకుపోయి చివర్లో నా దగ్గరకు వచ్చినప్పుడు చేజేతులా ప్రాణం మీదికి తెచ్చుకున్న వాళ్ల అశ్రద్ధా మీదా, ఆ పరిస్థితుల్లో వాళ్లను రక్షించలేని నా నిస్సహాయత మీదా కోపమూ, బాధా కమ్ముకుంటాయి. ఈ ఆడవాళ్ళకి ఎప్పటికీ బుద్ధి రాదా? శాస్త్రీయ విజ్ఞానం ఇంతగా పెరిగి వున్న యీ ఆధునిక యుగంలో కనీస జ్ఞానంతో తన గురించిన తగు జాగ్రత్త తీసుకోవాలన్న తెలివి లేకుండా బతుకుతున్నారేమిటా అని బాధ కలుగుతుంది. తానూ మనిషి నన్న జ్ఞానం ఆడవాళ్లకుండదా? అనుకుంటాను. నీవూ అందరిలాగే ఉన్నావని నమ్మలేకపోతున్నాను. నీవు చదువుకున్నదానివి. మీ ఆయనా పిల్లలూ నీ క్షేమం కోరేవారే. నీ ఆరోగ్యం గురించి ఎందుకిలా అశ్రద్ధ చేస్తున్నావు? ఆ ఇల్లు నడపాల్సిన యంత్రాన్ననుకుంటున్నావా? నీవూ ఒక మనిషివని నీకూ, మీ వాళ్లకూ కూడా తెలియటంలేదా" అని కోప్పడ్డది.

నా ప్రయాణం ఆపు చేయించి ఏవో పరీక్షలు చేసి వెంటనే గర్భసంచి తొలగించే ఆపరేషన్ చెయ్యాలన్నది. ఇంకా నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే.

నా పరిస్థితి గురించి వినగానే నాలో ఆలోచన ప్రారంభమైంది. ప్రతి సాంప్రదాయిక కుటుంబంలోనూ గృహిణి ఒక చోదక శక్తి. ఆవిడ ఉనికి ఎవరి

ఆలోచనలోకి రాదు. అన్నీ వెనుక అమర్చిపెట్టడం ఆవిడ పని. 'పనులు' చేసేది మిగతావాళ్ళు. ఆవిడలేకపోతే ఆ యిల్లే స్తంభిస్తుంది. కాని ఆవిడ దేనికీ కర్త కాదు! రోజూ తన ఆరోగ్యంగురించి ఏవేవో చిన్న కంప్లయింట్లు చెప్పుకుంటున్నా యింటిని నడిపిస్తున్నంత కాలం ఆవిడ మాటలెవరూ పట్టించుకోరు-ఆవిడతో సహా. తీరా మంచాన పడ్డాకే ఆవిడ ఒక మనిషిగా గుర్తించబడుతుంది.

ఇప్పుడైనా తల్లికి అస్వస్థతగా ఉందని చూడటానికి వచ్చింది తాను విజయవాడకు. ఈ వారం రోజుల్లో తన ఇల్లంతా అల్లకల్లోలమైపోకుండా, ఎన్నో జాగ్రత్తలు చెప్పి తన ఆడబిడ్డను తన స్థానంలో నిలిపి వచ్చింది.

మధ్యలో స్నేహలత ప్రశ్న. అవును, ఏమిటీ గృహిణీమణుల పరిస్థితి?

చేయాల్సిన ఆపరేషన్ స్నేహలతే చేస్తుంది-రెండ్రోజుల తర్వాత. విషయం నిర్ణయమైనా హైదరాబాద్‌కి ఫోన్ చేసి 'తనవాళ్ళ'కి వెంటనే చెప్పాల నిపించలేదు. అంతర్గతంగా నాలో ఏదో తెలియని కసిలాంటి అసంతృప్తి వుండే వుంటుంది నా పరిస్థితిని గురించి. స్నేహలత మాటలతో యీ రూపం తీసుకుంది. ఇంట్లోని అందరి గురించీ నేను ఆలోచిస్తాను. వాళ్ళ ఆరోగ్య పరిస్థితిగురించి యిలా నిర్లక్ష్యం చేయడం ఎప్పుడూ జరగదు! కాని నా గురించి ఎవరూ ఆలోచించరు! ఎందువలననో అర్థం కాదు గాని నేను గూడా ఆలోచించను నా గురించి! గృహిణిగా నా బాధ్యతలు జరిపినన్నాళ్ళూ నేను మనిషిని: మంచాన పడితే మూలన పడుండాల్సిన పాత సామాన్ల మూటని! ఇది యీనాటి కుటుంబ న్యాయం!

'నావాళ్ళు' ఎవరూ లేకుండా ఇంత పెద్ద ఆపరేషన్ చేయించుకోవటమే! ఏదైనా అవాంఛనీయం జరిగితే! యిక్కడే నాలోని 'కసి' బయటపడ్డది. జరిగితే దానికి ఎవరేం చెయ్యగలరు ? స్నేహలత చూసుకుంటుంది అనుకున్నాను. కుటుంబ సభ్యుల్ని గురించి ఆలోచించడానికి నా మనస్సు నిరాకరించింది. అట్లాగని ఎవరిమీదా నాకేమీ కోపంలేదు! అయినా, ఇప్పుడు ఏవో బాదరబందీల్లోనుంచీ నాకు విముక్తి లభించినట్లు స్వేచ్ఛ వచ్చినట్లు తేలిగ్గా ఉంది.

నర్సింగ్ హోమ్ తాలూకు విశాలమైన బాత్ ఎటాచ్డ్ గదిలో మంచంమీద పడుకుని ఉన్నాను. ఇక్కడ మా ఇంట్లో కంటే చాలా శుభ్రంగా ఉంది. ఫాన్ రెక్కలమీద కొంచెం కూడా దుమ్ములేదు. పై కప్పు, గోడలూ, నేలా అన్నీ అప్పుడే కడిగినట్లు మెరుస్తున్నవి. నా మనస్సు కూడా స్వేచ్ఛగా స్వచ్ఛంగా వుంది. ఇప్పుడు ఇక్కడ నేను నేనే! నా ఇష్టం నాది!

తలుపు మెల్లగా తెరుచుకుంది. సలభై ఏళ్ళ స్త్రీ నెమ్మదిగా లోపలికి అడుగుపెట్టింది చిరునవ్వు నవ్వుతూ. ఆమె పచ్చని బంగారు రంగులో

మెరిసిపోతూవుంది. ఆమె పెట్టుకున్న ఖరీదైన కెంపుల ఆభరణాలు ఆమె ఒంటి మెరుపుమీద చిన్నబోతున్నట్లే వున్నాయి. విలువైన కనకాంబరం రంగు పట్టుచీర, ఖరీదైన చెప్పులు, పాదాలమీద మెరుస్తున్న కెంపులు పొదిగిన బంగారు పట్టీలు...

"నన్ను గుర్తుపట్టలేదా, కమలొదినా?" అన్నది కొంచెం సంకోచంగా. చిన్నగా వుండి జీవం తొణికిసలాడే కళ్ళు, గులాబీరంగు పెదవుల వెనుక అందమైన దానిమ్మ గింజల్లాంటి పలువరుస, కొనతేలిన చిన్నముక్కు. లీలగా మెరుస్తున్న జ్ఞాపకం ఆ మాటలో వెలికి వచ్చింది.

లలిత!

"రా కూర్చో!" అన్నాను ముభావంగా.

"మా అమ్మాయి దీప్తి పుట్టిన రోజు పార్టీకి పిలవడానికి వస్తే స్నేహలత చెప్పింది నువ్విక్కడున్నావని" అన్నది. కుర్చీ దగ్గరకు తెచ్చుకుని కూర్చుంది.

లలిత నాకు మామయ్య కూతురు. పాతికేళ్ల క్రిందట చూశాను లలితని-తెనాలి దగ్గర ఒక పల్లెటూళ్ళో మా పెద్దమ్మ కొడుకుతో పెళ్లి జరిగినప్పుడు. అప్పుడు నాకూ, లలితకూ కూడా పదిహేనేళ్ళ వయసుండొచ్చు. పెళ్ళిలో పెళ్ళి కూతురు ఏడుస్తూనే ఉన్నదని మా అమ్మావాళ్లు చెప్పుకోవడం విన్నాను. మా అన్నయ్య తన బాల్య స్నేహితురాలు ఎవర్నో ప్రేమించి, భగ్న ప్రేమికుడై మతి పోగొట్టుకుని ఇప్పుడిప్పుడే మనుషుల్లో పడుతున్నాడు. 'ఎవర్నో ప్రేమించిన ఈ మనిషితో నాకు పెళ్ళేమిట'ని లలిత బాధ. లలితకి వూహాలోకాలు అల్లుకుని ఆలోచించడం అలవాటనీ, సున్నితమైన మనస్సనీ వాళ్ళవాళ్ళు చెప్పుకున్నారు. అన్నయ్య ఇంజనీరు, గుణవంతుడు. లలిత రూపసి గనుక అంతా సర్దుకుపోతుందని అనుకున్నారు.

పెద్దల మాట జవదాటలేని 'మంచిపిల్ల'గా లలిత తాళి కట్టించుకోవడానికి ఏడ్చుకుంటూనే తలవంచింది.

కాని దూరాన ఆకాశంలో వెలిగే తన ఆశయాల చందమామకోసం ఏడవడం మానలేదేమో!

తాను ఎందుకోసం ఏడుస్తున్నదో తనకైనా సరిగ్గా అర్థం అయిందో లేదో!

తనూ ఒక స్వతంత్ర వ్యక్తి అయినట్లు, తన కోరికలకూ అభిప్రాయాలకూ ఏదో విలువ వున్నట్లు వూహించుకుందా!

తనొక ఆడపిల్లనన్న విషయం తెలియలేదా?

ఈ విషయాలన్నీ చర్చకు రాకుండానే పెళ్ళి చేసేసి తమ బాధ్యత దించుకున్నారు పెద్దలు. తర్వాత వాళ్లిద్దరూ అన్నయ్య ఉద్యోగరీత్యా దేశం విడిచి వెళ్లిపోయారు.

ఆ దేశంలోనే రామ్‌చరణ్ పుట్టడం, తర్వాత ఏడాదికి అన్నయ్య జబ్బుచేసి చనిపోవడం జరిగింది. లలిత తన కొడుకునీ, రెండు లక్షల డబ్బునీ, ఇరవైఏళ్ళ యవ్వనాన్నీ వెంటబెట్టుకుని విమానంలో వచ్చి దిగింది. ఈ పర్యవసానం గురించి బంధువుల్లో రామ్‌చరణ్ మీద జాలి కలిగిందిగాని లలితమీద సానుభూతి లేదు. అన్నయ్య చావుకి లలిత నిరంతర సాధింపే కారణం అయ్యుంటుందని చెప్పుకుని అసహ్యించుకుని ఆమె గురించి ఆలోచించడం మానేశారు.

లలిత తన యింటర్ చదువుతో ఏవో ఉద్యోగ ప్రయత్నాలు చేసిందనీ, చెల్లెలు భారతికి నెలనెలా కొంత డబ్బు యిస్తూ కొడుకును పెంచే బాధ్యత అప్పగించిందనీ ఒక వ్యాపారస్తుణ్ణి రెండో పెళ్ళి చేసుకుందనీ విన్నాను. మళ్ళీ ఇప్పుడే చూడటం. లలిత చేసిన ఏ పనినీ మేమెవరమూ హర్షించలేదు ఎప్పుడూ. 'వీరేశలింగం పంతులుగారు ఇక్కడ పాదుకుని వున్న వ్యవస్థ లోతుల్ని క్షుణ్ణంగా పరిశీలించారా?' అన్న అనుమానం ఉంది నాకు.

"కమలొదినా! నీవు చదువుకున్నదానివి, తెలివిగలదానివి. నా గురించి నీవు ఎన్నో వినే వుంటావు. నేనంటే ఏ మాత్రం సానుభూతి వుండదని నాకు తెలుసు. పైకి ఎలా మాట్లాడినా మన బంధువులకు మనసులోపల నేను 'కేటు'గానే ఉండిపోతాననీ తెలుసు. కాని నా కారణాలు వింటే నీవు నన్ను అర్థం చేసుకోగలవని నా ఆశ. నేను ఇండియాకి వచ్చాక నా దగ్గరున్న నగలు, డబ్బుకోసం తోబుట్టువులతో సహా బంధువులందరూ ఎలా ప్రవర్తిస్తున్నారో నాకు తెలిసింది. అందువలన ఉద్యోగాలు చెయ్య ప్రయత్నించాను.

"కాని ఒదినా, తెలిసినవాళ్ళూ, తెలియని వాళ్ళని భేదం లేకుండా ప్రతివాళ్లూ నన్ను ఏదో విధంగా లోబరచుకోవాలని చూశారు. వదినా, ఈ లోకంలో ఆడమనిషి మనిషి కాదు. నాలాటి ఆడవాళ్లను చూస్తే మంచివాళ్ళకు కూడా కాస్త ఆలస్యంగానైనా వంకర ఆలోచన్లే వస్తవి. శంకరం బాబాయి చచ్చిపోయాక అన్నపూర్ణమ్మ పిన్ని ఏమైంది? ఉన్న కొద్ది ఆస్తీ పోగొట్టుకుని భ్రష్టురాలైపోయి, ఇప్పుడు గుంటూరులో రైలుపేటలో దోసెలమ్ముకుని బ్రతుకుతున్నది.

"అన్నీ చూశాక నేను ఒక నిశ్చయానికొచ్చాను. మహేంద్రగారిని పెళ్ళి చేసుకున్నాను. వాళ్ళ ఊళ్ళో అతనికి భార్యా పిల్లలూ ఉన్నారు. వాళ్ళకి అన్యాయం జరిగిందనీ నన్నే తిడుతున్నారు - మహేంద్రగారిని కాదు! వాళ్ళ బాధ్యత నాదా? మహేంద్రగారిదా? చెప్పు. ఇప్పుడు మాకు డబ్బుకు లోటు లేదు. బాగా వృద్ధి అవుతూ ఉంది. నాకు ఇద్దరు పిల్లలు. సుధీర్, దీప్తి. బయట్నుంచి చూస్తే నాకు కాలం బాగానే గడిచిపోతున్నది. అవకాశం ఉన్నంతవరకూ పరిస్థితుల్ని నా చేతనైనట్లు మలుచు

కున్నాను. కాని నాకు మనసులో ఎప్పుడూ వెలితి, బాధ గూడుకట్టుకునే వున్నాయి. అవి నన్నొదలవు. కమలొదినా, నేను చేసిందాన్లో తప్పేమిటో చెప్పు" అన్నది.

ఈ సమాజంలో స్త్రీలకు న్యాయం జరుగుతుందని ఎవరూ అనలేరు. స్త్రీ రెండో పెళ్లి చేసుకోవడం తప్పనీ అనరు. కాని ఎందువలననో సమాజం అన్నపూర్ణమ్మ పిన్ని మీదైనా జాలి చూపిస్తుందిగాని లలిత మీద చూపించదు!

మా అన్నయ్య మితభాషి. నిదానస్తుడు. ఒకరకంగా నా చిన్నతనంలో నాకు ఆదర్శమూర్తి. అంతంత చదువులు చక్కగా చదువుకోగలిగాడంటె దాని క్కారణం మా అమ్మ చెప్పింది: ప్రతిరోజూ చదువు మొదలుపెట్టబోయే ముందు 'తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతంబూనితిన్...' అంటూ సరస్వతీ ప్రార్థన చేసేవాడని. చాలా రోజులు నేనూ అలాగే చేశాను. మా అన్నయ్య జీవితంలో సుఖపడలేదు. దానికి లలిత బాధ్యత ఎంతో నేను చెప్పలేను. ఇప్పుడూ లలితమీద నాకు సానుభూతి కలుగలేదు. అన్ని పగ్గాలూ చేతబట్టుకుని బతుకుతూ డబ్బులో మునిగితేలుతున్న ఈవిడలో బాధ గూడు కట్టుకోవడం ఏమిటి?

"రామ్‌చరణ్?" అన్నాను ఉదాసీనంగా-లోపం ఎత్తి చూపెడుతూనే. "పోయినేడాది వాడికి పెళ్ళి చేశాను. మీ కందరికీ శుభలేఖలు పంపించాను. వాడు అత్తగారింట్లో రేపల్లెలో ఉంటున్నాడు" అన్నది. మనసులో ఏమనుకున్నదో తెలియదు. లేచి "నన్నర్థం చేసుకో వదినా" అనేసి వెళ్లిపోయింది.

లలిత వెళ్తూ ఉంటే తన పాదాల మీద మెరుస్తున్న కెంపులు పొదిగిన బంగారు పట్టీలను చూస్తూ "నేను అర్థం చేసుకున్నా చెసుకోకపోయినా ఈవిడకేమీ నష్టం లేదు!" అనుకున్నాను సానుభూతి లేకుండా.

★★★

రెండేళ్ళు గడిచివుండొచ్చు. మధ్యాహ్నం భోజనం అయాక టీవీ ముందు కూర్చుని వున్నాను. డోర్ బెల్ మోగింది. పని కుర్రాడు వెళ్ళి ఒక పాతికేళ్ళ కుర్రాణ్ణి వెంటబెట్టుకు వచ్చాడు. ఆ అబ్బాయి సన్నగా, చామనఛాయలో సాదాగా వున్నాడు. సందేహిస్తూ నిలబడ్డాడు. ఎవరివన్నట్లు చూస్తూ ఉన్నాను.

"అత్తా, నేను రామ్‌చరణ్‌ని" అన్నాడు మరింతగా ముడుచుకుపోతూ.

"కూర్చో" అన్నాను.

బెరుగ్గా, సిగ్గుపడుతూ ఎదుటి సోఫాలో ఇబ్బందిగా ముందుకు వంగి కూర్చున్నాడు.

వీడన్నమాట మా అన్నకొడుకు ! నాలో ఏమీ ప్రత్యేకమైన అభిమానం పొంగి రాలేదు. 'ఎందుకొచ్చాడిప్పుడు?' అనుకున్నాను. మా వల్ల ఏదో పని కావాల్సి వుండొచ్చు.

లేకుంటే ఇన్నేళ్ళకు నన్ను చూడరావటానికి కారణం లేదు మరి.

వాడు నోరు విప్పే సూచనలేమీ కానరాకపోవడంతో "అమ్మ బాగుందా?" అన్నాను.

అమ్మ ప్రస్తావన రావడంతో ముఖంలో నవ్వు కనబడ్డది. "బాగుంది. మిమ్మల్ని గురించి చెప్తూ ఉంటుంది... పనిమీద హైదరాబాద్ వచ్చాను. ఊరికే చూసి వెళ్దామని వచ్చాను" అన్నాడు.

ఊరికే చూడటమేమిటి? అనుకున్నాను. నాకు నిద్రకు టైమవుతూ ఉంది. వాడు వూరికే కూర్చుని వున్నాడు. "మీ అమ్మ దగ్గర కెప్పుడైనా వెళ్తుంటావా? బాగా పలకరిస్తుందా?" అన్నాను ఆవులిస్తూ.

దూరదేశానికి ఫోన్ చెయ్యాలని నంబర్ డయల్ చేస్తే ఆ ఫోన్ కొంతసేపు మీనమేషాలు గుణించుకుంటూ వుండిపోయినట్లు కొంచెంసేపు వూరికే చూస్తూ వుండిపోయాడు. తర్వాత మెల్లగా 'ఊఁ' అని లేచి నిల్చున్నాడు.

"ఇక వెళ్తానత్తా!" అన్నాడు. కొంచెం కాఫీ తాగి వెళ్లమని చెప్తుండగానే వద్దనేసి వెళ్లిపోయాడు. తర్వాత మా ఆయనతో ఆ విషయం చెబుతున్నప్పుడు నాకు తోచింది- వాళ్ళమ్మని గురించి అలా అడిగి వుండకూడదేమోనని.

తర్వాత నాలుగైదేళ్లు గడిచి ఉండవచ్చు. కాన్సర్ హాస్పిటల్‌నుంచి ఫోన్ వచ్చింది. లలిత అక్కడ అవసాన దశలో ఉన్నదనీ, నన్ను చూడాలని కోరుతున్నదనీ-మహేంద్రగారు ఫోన్ చేశారు. ఎక్కడో మనసు మూలన జాలో, రక్తసంబంధమో, కేవలం కుతూహలమో ఏదో మెదిలింది. హాస్పిటల్ గది నంబరు కనుక్కున్నాను. ఆ సాయంత్రం వెళ్ళాను లలితను చూడడానికి.

నిజంగానే లలిత అవసాన దశలో ఉంది. ఒకప్పటి గొప్పదనమూ, అందమూ, కళాకాంతులన్నీ తొలగిపోయినై. నన్ను చూడగానే ఆ కళ్ళలో చైతన్యం కనిపించింది. గదిలో ఎవరూ లేరు. దిండు క్రింద ఉన్న పుస్తకంలో నుంచీ ఒక కవరు తీసి నా చేతికిచ్చింది. 'ఇంటికెళ్లాక చూడు' అన్నది. లలిత కళ్ళలోంచి ధారగా నీళ్ళు కారుతున్నాయి. కవరు తీసి హేండ్‌బాగ్‌లో పెట్టేశాను. తనని తాను సమర్థించుకునే మరో ప్రయత్నం కాబోలు! ఇతరులు తన గురించి గొప్పగా తలుచుకోవాలనే ప్రాకులాట శరీరం రాలిపోబోతున్న చివర్న కూడా బాధిస్తుందా? 'అయ్యో వెర్రిదానా' అనుకున్నాను.

లలితను ఓదార్చాలని ప్రయత్నిస్తుండగా మహేంద్రగారు వచ్చారు. మనిషి తెల్లగా, భారీగా, హుందాగా చాలా పెద్దమనిషిలాగున్నారు. ఆయన కళ్లలో ఏదో ఆదుర్దా, ప్రశ్న. కొంచెంసేపు మౌనంగా నిల్చుని బయటికొచ్చేశాను. అక్కడ సుధీర్, దీప్తిలను పరిచయం చేశారు మహేంద్ర. ఇద్దరూ కూడా చక్కని పిల్లలు. తల్లి గురించిన దుఃఖంతో

ముఖాలు కొంత దీనంగా ఉన్నా, ఐశ్వర్యం, ఆరోగ్యం వాళ్ళని వేరే స్థాయిలో నిలబెడుతున్నాయి. రామ్‌చరణ్‌కీ, వీళ్లకీ ఎక్కడ పోలిక? అందరికీ సానుభూతి తెలిపి వచ్చేశాను.

తర్వాత పది రోజులకు విజయవాడనుంచి పోస్టులో శుభస్వీకరణ కార్డు వచ్చింది. దాని మీద ప్రముఖంగా అందం కుప్పపోసుకున్న నాటి లలిత నవ్వుతూ ఉంది పెళ్ళి కూతురిలా.

రామ్‌చరణ్ వచ్చాడు. నాలుగేళ్ళ క్రిందటి మనిషి కాదు ఇప్పుడు. ముఖంలో తీవ్రత, పట్టుదల, కసి వాడి రూపాన్నే మార్చేశాయి. కోర్టులో మహేంద్రగారిమీద కేసు వేసి లలిత ఆస్తిపాస్తులన్నీ సీల్ చేయించాట్ట. సంకోచం లేకుండా మాట్లాడుతున్నాడు. "అమ్మ హాస్పిటల్‌లో ఉన్నప్పుడు నన్ను దగ్గరకు వెళ్లనివ్వలేదు. మా అమ్మని చివరి క్షణాల్లో చూసుకోవాలని ఎంత ఆరాటపడ్డాను. విజయవాడలో ప్రాణంలేని అమ్మ శరీరంమీద పడి కొంచెం సేపు ఏడవనిచ్చారు...బయటకొచ్చి కాంపౌండ్‌లో తిరుగుతున్న నన్ను ఆయన ఏమన్నారో తెలుసా? ఏం కార్లు లెక్కబెట్టుకుంటున్నావా? ఇక్కడ నీకు చిల్లిగవ్వకూడా లేదు పో అన్నారు. అమ్మకి పెద్దకొడుకుగా కర్మలు చేస్తానన్నాను. నన్ను బయటికి గెంటించారు. నేనే సత్రంలో వేరుగా అమ్మకి కర్మలు చేశాను. అవన్నీ అమ్మకి అందుతాయన్న నమ్మకంతోకాదు...కాని అంతకన్నా అమ్మకోసం నేనేం చెయ్యగలను?" అన్నాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు...లలిత చచ్చిపోయేముందు నా చేతికిచ్చిన కవరు. గబగబా లోనికెళ్లి సొరుగుల్లో వెతికి పట్టుకుని వచ్చాను.

"వదినా,

నా జీవితానికి ఆఖరి తెరపడింది. నా బ్రతుకు చివరకొచ్చేసింది. నేను బ్రతికున్నప్పుడు నా పరిస్థితిని ఎవరూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించలేదు. ఎందువలన? ఆకసమంత గొడుగులాగా అందర్నీ కాపాడుతున్నట్లు కనిపించే ఈ వ్యవస్థకి ఎంత హ్రస్వదృష్టి ఉందో గ్రహిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఆలోచించగల నీలాంటి వాళ్లు కూడా చేదునిజం ఎదురైనప్పుడు కళ్ళు మూసుకుని ఆ గొడుగు నీడన నిద్రపోతారు. ఆలోచనని జోకొడతారు. స్పందన, ఆర్ద్రత ఎరుగని ఒక కఠిన శిలారూపం యీ వ్యవస్థ. దాని పరిధినుంచీ కొంచెం పక్కకి వెళ్ళిన నాలాంటి వాళ్ళకే అది అనుభవానికొస్తుంది.

ఒకనాడు ఈ విషయం నీకు చెప్పాలని ప్రయత్నించి ఓడిపోయాను. నా పరిస్థితిని గురించి నీకు సానుభూతి లేదని నాకు తెలుసు. కాని నేను ఎంత ఒంటరిదాన్నో వూహించగలిగితే నీకు కొంచెం జాలి కలుగవచ్చు. ఆ జాలితోనైనా, నా

చివరి కోర్కెను తీరుస్తావని నమ్ముతున్నాను. నా కొడుకని అనుకో లేకపోతే నీ అన్న కొడుకని అనుకుని రామ్‌చరణ్‌కి సహాయం చెయ్యి. వాడికి తండ్రి లేడు. నేను ఉండీ వాడికి తల్లి లేకుండా చేశాను. పరిస్థితులలాంటివి. నా అన్నవారు ఎవరూ లేకుండా పెరిగిన అనాథ వాడు. వాడిని తలచుకొనిపాతికేళ్ళ నుంచీ కడుపులో నిరంతరమైన చిచ్చును మోసుకున్నాను. వాడి మంచి కోసమేనని నమ్మి వాడిని దూరం పెట్టాను.

"నా చిన్న పరిధిలో ప్రపంచాన్ని గురించి నేను అర్థం చేసుకున్న విషయం ఒకటుంది. మానవ సంఘంలో ఉన్న గొప్ప నిజం పోటీ. అనేక స్థాయిల్లో అనేక విధాలుగా ఈ సంఘాన్ని శాసిస్తున్నది అది. ఇక్కడ ప్రాథమికంగా రెండే జాతులున్నాయి. దోపిడీ చేసేవారూ, చెయ్యబడేవారూ అని. బలహీనులు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు-వీళ్ళు రెండో జాతికి చెందుతున్నారు. ఈ గెలుపు ఓటములకు కీలకరూపం డబ్బు. అది గమనించిన నేను ఒక్క విషయంలో మొదట్నుంచీ జాగ్రత్తపడ్డాను. మీ అన్నయ్య తాలూకు డబ్బుని పదిలంగా కాపాడి వృద్ధి చేశాను. నా చెయ్యి దాటకుండా చూసుకున్నాను. ఎంత జాగ్రత్తపడినా మహేంద్ర కొంతవరకూ టాక్సులనీ, గిఫ్టులనీ, డిపాజిట్స్ నామినీలని...సుధీర్, దీప్తిల పేర్లకి మళ్ళించారు. వాళ్ళూ నా బిడ్డలే. కాని వాళ్ళకి అన్నీ చూసుకునే స్తోమతగల తండ్రి వున్నాడు. వాళ్ళు తల్లితండ్రుల ప్రేమనీ, ఐశ్వర్యాన్నీ అనుభవించారు. నా రాముడికి ఏమీ లేదు. అదే నా బాధ.

నేను పోయాక నా ఆస్తి తాలూకు వీలునామా వాడికి అందజెయ్యి. నీకంటే దగ్గరవాళ్ళు నాకెవరూ లేరంటే నా పరిస్థితిని అర్థం చేసుకోగలవు. వదినా, ఇప్పుడు చెప్పు. నేను ఈ ప్రపంచంలో ఎవరిని? ఈ సంఘంలో నా స్థానం ఏమిటి? నేను నేనుగా బతకటానికి ఇక్కడ అనుకూల పరిస్థితులున్నాయా?..."

అంతా చదివి మౌనంగా ఆ ఉత్తరాన్నీ వీలునామానీ రామ్‌చరణ్ చేతికి అందించాను. అవి నిదానంగా చదివి జేబులో పెట్టుకుని 'వెళ్తానత్తా' అని వెళ్ళిపోయాడు.

★★★